క్లుప్తంగా

పెదవడ్లపూడి శివాలయంలో కార్తిక పూజలు



మంగళగిరి: నగర పరిధిలోని పెదవడ్లపూడి శివాలయ ఆవరణలో కార్తిక మాస వనసమారాధన మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్చార్జి గంజి చిరంజీవి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అన్నే శేషారావు, జువ్వాది పూర్ణచంద్రరావు, పూర్ణసీతారామయ్య, మండపాటి చక్రవర్తి, రాంబాబు, ఇస్రాయిల్, నరేంద్ర పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన



మంగళగిరి: ఆరోగ్య కార్యకర్తలు ప్రజలను మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే నష్టాలను వివరించి నియంత్రణపై అవగాహన కల్పించాలని నవజీవన్ బాలభవన్ ప్రతినిధులు తెలిపారు. నగర పరిధిలోని యర్రబాలెం వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో మంగళవారం మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జి.శేఖర్, యర్రబాలెం, నిడమర్రు హెల్త్ సెంటర్ల మెడికల్ ఆఫీసర్లు రాజేష్, ఐశ్వర్య పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన అవసరం



మంగళగిరి: ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లపై ప్రజలకు అవగాహన కల్పించాలని అర్బన్ అసిస్టెంట్ ఎలక్టోరల్ అధికారి, కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ కె.హేమమాలిని తెలిపారు. మంగళవారం నగరంలో 148వ పోలింగ్ కేంద్రంలో ఈవీఎంల వినియోగంపై అవగాహన కేంద్రాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ బీఎల్‌ఓలు ఈవీఎంలలో ఓటు ఎలా వినియోగించాలనే దానిపై ఓటర్లకు అవగాహన కల్పించాలని కోరారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు అవగాహన కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. అవకాశాన్ని ఓటర్లు వినియోగించుకుని ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీపీఓ రమేష్‌బాబు, బిందుప్రియ పాల్గొన్నారు.

పరిమితికి మించి ప్రయాణిస్తే జరిమానా



ఫిరంగిపురం: పరిమితికి మించి ప్రయాణికులతో ఆటోల్లో వెళ్లడం చట్టరీత్యా నేరమని అందుకు జరిమానా విధిస్తామని గుంటూరు ఎంఈవి కె.మల్లేశ్వరి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రేపూడి గ్రామ శివారులో మంగళవారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పాఠశాలల విద్యార్థులను ఆటోల్లో పరిమితికి మించి తీసుకెళ్తున్నారని చెప్పారు. అటువంటి వాటిపై కేసులు నమోదు చేస్తామని అవసరమైతే లైసెన్సును కూడా రద్దు చేస్తామని హెచ్చరించారు. గూడ్స్ వాహనాల్లో ప్రయాణికులను ఎక్కించడం నేరమని చెప్పారు. లైసెన్సు లేకుండా ప్రయాణించకూడదని, వాహనాలకు తప్పనిసరిగా ఇన్సూరెన్సు ఉండేలా చూసుకోవాలని తెలిపారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తల్లిదండ్రులకు సూచించారు.

బంగారం చోరీ

పట్నంబజారు: నివాసంలో చోరీ ఘటనపై కేసు నమోదైంది. పాతగుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆర్టీసీ కాలనీలో నివాసం ఉండే హసీనా ఈనెల 11వ తేదీ రాత్రి అదే ప్రాంతంలో నివాసం ఉంటున్న ఆమె తల్లి నివాసానికి వెళ్లారు. మంగళవారం ఉదయం తిరిగి ఇంటికి వచ్చేసరికి తలుపులు పగులగొట్టి ఉండటం గమనించింది. ఇంట్లోకి వెళ్లి చూడగా 24 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తపాలా ఉద్యోగుల సంఘం గ్రూప్ సీ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా రామకృష్ణ

లక్ష్మీపురం(గుంటూరువెస్ట్): అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం గ్రూప్ 'సీ' ఆంధ్రప్రదేశ్ సర్కిల్ సహాయ కార్యదర్శిగా ఎం.రామకృష్ణ ఎన్నికయ్యారు. ప్రకాశం జిల్లా మార్కాపురంలో ఈనెల 10, 11 తేదీల్లో యూనియన్ రాష్ట్ర మహాసభలు నిర్వహించారు. మహాసభలకు ఆంధ్రప్రదేశ్‌లోని 26 జిల్లాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. సభలో రాష్ట్ర అధ్యక్షుడిగా ఈ.శంకర్ నాయుడు (విజయనగరం), రాష్ట్ర కార్యదర్శిగా శ్రీధర్‌బాబు (తిరుపతి) ఎన్నికయ్యారు. సభ లో పోస్టల్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యపై చర్చించినట్లు ఎం.రామకృష్ణ తెలిపారు.

వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులకు సన్మానం



ప్రకాష్‌నగర్‌లోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో డాక్టర్ మానసను సన్మానిస్తున్న నాయకులు

తాడేపల్లిరూరల్: దేశవ్యాప్త గుర్తింపు పొందిన వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులను వైఎస్సార్ సీపీ నాయకులు మంగళవారం అభినందించారు. ప్రకాష్‌నగర్‌లోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ నాణ్యత ప్రమాణాలు పాటించడంలో అగ్రస్థానం నిలిచింది. గుర్తింపు వచ్చే విధంగా ప్రజలకు సేవలు అందించిన వైద్యులు డాక్టర్ మానసను వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ భారతదేశంలో ఎక్కడా లేని విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక సంస్థల నిధులతో వైఎస్సార్ అర్బన్ హెల్త్‌సెంటర్లను కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) పనిచేసిన కాలంలో ప్రత్యేక శ్రద్ధ చూపించి ఆస్పత్రి నిర్మాణ పనులు చేపట్టి వైద్యులకు అవసరమైన విధంగా నిర్మాణాలు చేపట్టి వైద్య సేవలను ప్రారంభించారని చెప్పారు. ఈ ఆస్పత్రి దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదుల మూడి డేవిడ్ రాజు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు మేడా పండు, ప్రధాన కార్యదర్శి చినపోతుల దుర్గారావు, సేవాదళ్ పట్టణ అధ్యక్షులు రమేష్, శ్రీనివాసరావు, గాలయ్య పాల్గొన్నారు.

యర్రబాలెం సెంటర్ డాక్టర్‌కి సత్కారం

మంగళగిరి: నగర పరిధిలోని యర్రబాలెంలోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజేష్‌ను వైఎస్సార్ సీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. పేదలకు నాణ్యమైన వైద్య సేవలందించడంతో పాటు హెల్త్ సెంటర్(నేషనల్ క్వాలిటి ఎస్యూరెన్స్ స్టాండర్డ్) ఎన్క్వాస్ సర్టిఫికెట్ సాధించిన సందర్భంగా డాక్టర్ రాజేష్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు మాట్లాడుతూ హెల్త్ సెంటర్ కార్పొరేట్ ఆస్పత్రికి దీటుగా తీర్చిదిద్దడంలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) కృషి అభినందనీయమన్నారు. హెల్త్ సెంటర్‌కు అత్యధిక నిధులతో అన్ని మౌలిక వసతులతో పేదలకు నాణ్యమైన వైద్య సేవలందేలా చొరవే కారణమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గుండాల శ్రీనివాసరావు, మేరిగ నాగేశ్వరరావు, ఆర్.గోపి పాల్గొన్నారు.



డాక్టర్ రాజేష్‌ను సత్కరిస్తున్న స్థానికులు

జగనన్నతోనే అన్ని వర్గాలకు మేలు



వెంకటపాలెంలో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

వెంకటపాలెం(తాడికొండ): రాష్ట్రంలో అన్ని వర్గాలకు మేలు జరగాలంటే మళ్లీ జగనన్న సీఎం కావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని తుళ్లూరు మండల సీనియర్ నాయకులు కొప్పుల శేషగిరిరావు అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా వెంకటపాలెంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఏపీలో తాము గెలవడం కష్టమని తెలిసిన ప్రతిపక్షాలన్నీ చంద్రబాబు వెంట చేరి అద్దె మైకుల్లా అరుస్తున్నాయని పేర్కొన్నారు. ఎంతమంది కట్టగట్టుకొని వచ్చినా ప్రజలు నమ్మే పరిస్థితి ఉండదన్నారు. భారతదేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి తీసుకోని సంచలన నిర్ణయాలతో సంక్షేమాన్ని నేరుగా పేదవాడి ఖాతాలకు పంపించి వారిని ఆర్థికంగా, సామాజికంగా ఆదుకున్న వ్యక్తి వైఎస్ జగన్‌గా కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు ఎ.జక్రయ్య పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం అందించాలి



చిర్రావూరు రైతు భరోసా కేంద్ర అధికారిణి శాంతిశ్రీకి వినతి పత్రం అందజేస్తున్న రైతులు

తాడేపల్లిరూరల్: మిచాంగ్ తుఫాన్ కారణంగా నీట మునిగి పంట నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకునేందుకు, పంట నష్టం అంచనా వేసి తక్షణమే రైతులకు నష్టపరిహారం అందించాలని ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు కోరారు. ఎంటీఎంసీ పరిధిలోని చిర్రావూరులో రైతు, కౌలు రైతు సంఘం నాయకులతో కలసి ముంపునకు గురైన పంట పొలాలను మంగళవారం పరిశీలించారు. అనంతరం రైతు భరోసా కేంద్ర అధికారిణి శాంతిశ్రీకి వినతిపత్రం అందజేశారు. శివశంకరరావు మాట్లాడుతూ తుఫాను కారణంగా నీట మునిగినపంట పొలాల్లో, వరి పొలాల్లో నీరు బయటకు పోకుండా పొలాల్లోనే నిలబడి ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, పి.కృష్ణ, పి.శివ నాగేశ్వరరావు, పి.శంకరరావు పాల్గొన్నారు.

మిర్చి పంట పరిశీలన



మిర్చి పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త నాగలక్ష్మి

మేడికొండూరు: మండలంలోని విశదల, మందపాడు గ్రామాల్లో మిర్చి పంటలను లాంఫాం శాస్త్రవేత్త ఆర్.నాగలక్ష్మి మంగళవారం పరిశీలించారు. ఇటీవల తుఫాన్ ప్రభావానికి నష్టపోయిన మిర్చి పంట పొలాలను పరిశీలించారు. ప్రస్తుత పరిస్థితుల్లో పంట రికవరికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు. వాలిన మొక్కలు నిలబెట్టి మొదళ్లల్లో మట్టి పోయాలని చెప్పారు. మొలకెత్తి తలలు వాలిస్తే పది గ్రాముల యూరియా ద్రావణాన్ని వారంలో రెండు సార్లు పిచికారి చేయాలని కోరారు. ఐదుగ్రాముల మెగ్నీషియన్, ఐదు గ్రాములు ఆగ్రోమిన్ మిర్చితో లీటరు నీటితో కలిపి పిచికారి చేయాలని చెప్పారు. ఐదు మిల్లీలీటర్లు ఫామిక్ యాసిడ్ లీటరు నీటిలో కలిపి పిచికారి చేయడం వల్ల మొక్కలకు కొత్తగా వేర్లు ఏర్పడతాయన్నారు. కాయకుళ్లు రాకుండా ఉండేందుకు 1.5 గ్రాముల లీటరు నీటిలో యాసిడ్ కలిపి పిచికారి చేయాలన్నారు. దెబ్బతిన్న మిర్చి పంటలను అంచనా వేసి జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు శాస్త్రవేత్త తెలిపారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి పి.శిరీష పాల్గొన్నారు.

ఇంటెల్ పాఠశాల విద్యార్థి ప్రతిభ



ప్రతిభ కనబర్చిన విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సుకన్య, పీఈటీ రన్ హుస్సేన్

మేడికొండూరు: బాల ఉత్సవ్‌లో మండలంలోని పేరేచర్ల ఇంటెల్ హైస్కూల్ పాఠశాల విద్యార్థిని వేద సాత్విక ప్రతిభ చూపింది. పెదకాకాని మండలం వీవీఐటీ కాలేజీలో నిర్వహించిన బాలోత్సవ్‌లో సాత్విక లఘుచిత్ర విశ్లేషణలో ప్రతిభ కనబర్చి ద్వితీయ స్థానం సాధించింది. సాత్విక ప్రతిభకు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు సిబ్బంది అభినందించారు. డైరెక్టర్ డాక్టర్ కోనూరు జయకుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను బయటకు తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని చెప్పారు. స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సుకన్య, పీఈటీ రన్ హుస్సేన్‌లను జ్ఞాపిక అందజేసి అభినందించారు.

క్షత్రియ ఆత్మీయ సమావేశం

పాత గుంటూరు: చౌడేశ్వరి మాత అనుగ్రహంతో తొగట వీర క్షత్రియులు విద్య, సామాజిక, రాజకీయ పరంగా అభివృద్ధి చెందుతూ సఖ్యతతో మెలగాలని కుల గురువు దివ్యజ్ఞాన జ్ఞానానంద స్వామి అనుగ్రహ భాషణం చేశారు. మంగళవారం చౌడేశ్వరి తొగట వీర క్షత్రియ సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆర్.అగ్రహారం శ్రీ రామనామ క్షేత్రంలో తొగట వీర క్షత్రియ ఆత్మీయ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జ్ఞానానంద గిరి స్వామి ఆధ్వర్యంలో చౌడేశ్వరి అమ్మవారి కలశపూజ, దేవి స్తుతి నిర్వహించారు. అనంతరం తొగట వీర క్షత్రియ సమాజానికి గురు సందేశం ఇచ్చారు. అనంతరం ఆటల పోటీలు, యోగ, నృత్య ప్రదర్శనలు నిర్వహించి బహుమతులు అందజేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మిశెట్టి కృష్ణమూర్తి, కోశాధికారి నరమాల శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు అనంత మల్లికార్జున, ప్రధాన కార్యదర్శి పూజల అర్జున్ పాల్గొన్నారు.

ర్యాగింగ్ నిషేధంపై కరపత్రం విడుదల

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ర్యాగింగ్ పూర్తిగా నిషేధించబడినదని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ స్పష్టం చేశారు. ర్యాగింగ్ నిషేధంపై మంగళవారం వీసీ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య పి.రాజశేఖర్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం బోధన, పరిశోధనలకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సహచర విద్యార్థులకు ఏదైనా ఇబ్బంది కలిగిస్తే ర్యాగింగ్ కిందకు వస్తుందని, ర్యాగింగ్ జోలికి ఎవరు వెళ్లొద్దని సూచించారు. వర్సిటీలో ర్యాగింగ్ నిరోధక కమిటీలు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. విద్యార్థులు ఏసమస్యలు వచ్చినా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలన్నారు. క్యాంపస్‌తో పాటు వసతి గృహాలలో స్పెషల్ స్క్వాడ్ బృందాలను నియమించామని తెలిపారు. రెక్టార్ ఆచార్య పి.వర ప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, ఓఎస్డీ ఆచార్య కె.సునీత, సీడీసీ డీన్ ఆచార్య కె.మధుబాబు, సీడీఈ డైరెక్టర్ డాక్టర్ బి.నాగరాజు, బాలబాలికల హాస్టల్ వార్డెన్‌లు ఆచార్య వెంకట రత్నమ్మ, ఆచార్య నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

హక్కుల కోసం మిలిటెంట్ ఉద్యమాలు

మంగళగిరి: ప్రజలు తమ హక్కుల కోసం మిలిటెంట్ ఉద్యమాలు చేపట్టాలని దిశ విద్యార్థి సంఘం(డీఎస్‌ఓ) జాతీయ నాయకుడు అవినాష్ పిలుపునిచ్చారు. భగత్ సింగ్ జన్ అధికార యాత్ర మంగళవారం నగరానికి చేరింది. ఈ సందర్భంగా నగర పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కొత్తపేటలోని నిర్మల స్కూలు వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ భారత ప్రజల మౌలిక హక్కుల కోసం జరుగుతున్న పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లి ప్రజలను చైతన్యపరచేందుకు చేపట్టిన భగత్ సింగ్ జన్ యాత్ర డిసెంబర్ 10వ తేదీన బెంగళూరులో ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ యాత్ర దేశంలోని 13 రాష్ట్రాలు, 80కు పైగా జిల్లాల్లో 8500 కిలో మీటర్లు ప్రయాణించి మార్చి 3వ తేదీన ఢిల్లీ చేరుకుంటుందని పేర్కొన్నారు.

విద్యుత్ శాఖ అధికారుల ఆకస్మిక తనిఖీ

తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ నిఘా విభాగం ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు సీఆర్‌డీఏ సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్ డాక్టర్ ప్రత్తిపాటి విజయకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 3370 సర్వీసులను తనిఖీ చేయగా, వారిలో అనుమతి పొందిన లోడ్ కంటే ఎక్కువగా లోడ్ వినియోగించుకుంటున్న గృహ, వాణిజ్య, పారిశ్రామిక సర్వీసుల్లో 70 మందిని గుర్తించి, వీరి వద్ద నుంచి రూ.3,32,600 వసూలు చేశామని చెప్పారు. దాడుల్లో ఈఈలు కె.వి.ఎల్.ఎన్.మూర్తి, టీవీ తులసీరామ్, అధికారులు అక్కల సత్యనారాయణ, కె.వి. కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కౌలు రైతులందరికీ నష్టపరిహారం ఇవ్వాలి

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని 18 గ్రామాల్లో పంట నష్టపోయిన కౌలు రైతులందరికి నష్టపరిహారం ఇవ్వాలని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మన్నవ నాగమల్లేశ్వరరావు పేర్కొన్నారు. ఈ మేరకు చిలువూరు రైతు భరోసా కేంద్రం అధికారులకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ కౌలు రైతులకు 2019 జీఓ భూ యజమాని అంగీకారంతో కౌలు గుర్తింపు కార్డులు కొంతమందికి మాత్రమే వచ్చాయని అన్నారు. రబీ సీజన్‌లో విత్తనాలు పూర్తి సబ్సిడీ మీద కౌలు రైతులకు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు కర్రే దావీదు, మేళం అంజయ్య, కౌలు రైతులు నల్లపు మరియదాసు, బి.ఆశీర్వాదం, షేక్ యాసిన్, షేక్ కరీముల్లా, చిన్న నరసింహారావు, కె.రామారావు, రాజేష్ పాల్గొన్నారు.

మాదిగ మహాసేన అధ్యక్షుడిగా భానుప్రసాద్



తాడేపల్లిరూరల్: మంగళగిరి నియోజకవర్గ మాదిగ మహాసేన అధ్యక్షుడిగా కొండూరు భాను ప్రసాద్‌ను నియమిస్తూ మాదిగ మహాసేన వ్యవస్థాపక అధ్యక్షులు కొరిటిపాటి ప్రేమ్‌కుమార్ మంగళవారం నియామక పత్రాలు జారీ చేశారు. ఈ సందర్భంగా భానుప్రసాద్ మాట్లాడుతూ మాదిగలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్నారని, వారి సమస్యలపై పోరాడతానని అన్నారు.

వాలీబాల్ ఫైనల్‌లో విజేత బాప్టిస్ట్ రాక్స్



విజేత బాప్టిస్ట్ రాక్స్ జట్టు

మంగళగిరి: నగరంలోని బాప్టిస్ట్ పేటలో బాప్టిస్ట్ యూత్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహించిన వాలీబాల్ పోటీలలో బాప్టిస్ట్ రాక్స్ జట్టు విజేతగా నిలిచింది. ఈ పోటీలలో బాప్టిస్ట్ ఈగల్, బాప్టిస్ట్ రాయల్స్, బాప్టిస్ట్ పంథర్స్, బాప్టిస్ట్ లయన్స్, బాప్టిస్ట్ రాక్స్, బాప్టిస్ట్ స్పర్టన్స్ టీమ్‌లు పాల్గొన్నాయి. వీటిలో బాప్టిస్ట్ రాక్స్, బాప్టిస్ట్ రాయల్స్ జట్టులు ఫైనల్‌కు చేరగా మంగళవారం నిర్వహించిన పోటీలలో బాప్టిస్ట్ రాక్స్ జట్టు విజేతగా నిలిచింది. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

లింగ వివక్షపై అవగాహన ఉండాలి



కొలనుకొండలో గ్రామస్తులకు లింగ వివక్షపై అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

తాడేపల్లిరూరల్: ఆడ పిల్లలపై వివక్ష చూపించకుండా మగపిల్లలతో సమానంగా చదివించాలని, వారికి కూడా సమానమైన అవకాశాలు కల్పించాలని కేఎల్‌యూ విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ సిహెచ్.హనుమంతరావు అన్నారు. మంగళవారం ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి రూరల్ కొలనుకొండ గ్రామంలో వర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ పి.శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో లింగ వివక్షపై జరిగిన ఇంటింటి అవగాహన కార్యక్రమంలో వలంటీర్లు ప్రజలకు అవగాహన కల్పించారు. ఆడ పిల్లలను చదవనిద్దాం... బతకనిద్దాం అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. ఆడపిల్లలకు నిర్ణీత వయస్సు వచ్చే వరకు పెళ్లిళ్లు చేయరాదని, కరాటే, మార్షల్ ఆర్ట్స్ వంటి ఆత్మరక్షణ కోర్సులలో శిక్షణ ఇప్పించాలని వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న వలంటీర్లను వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం.డి.అబ్దుల్ బాసిత్, వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, డీన్ సలహాదారులు డాక్టర్ హబీబుల్లా ఖాన్, డాక్టర్ కె.ఆర్.ఎస్.ప్రసాద్, వ్యవసాయ విభాగాధిపతి డాక్టర్ బి.బాలకృష్ణ, పి. సురేష్, జి. చంద్రశేఖర్ అభినందించారు.

ఆకట్టుకున్న సేవ్ అవర్ నేచర్ నాటిక



చిన్నారులు ప్రదర్శిస్తున్న సేవ్ అవర్ నేచర్ నాటకం

తాడేపల్లిరూరల్: మంగళగిరి– తాడేపల్లి బాలోత్సవంలో మంగళవారం చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లిలోని అరవింద హైస్కూల్‌లో నిర్వహిస్తున్న బాలానందం కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఇంద్రాణి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకత గురించి విద్యార్థులు ప్రదర్శించిన 'సేవ్ అవర్ నేచర్' నాటిక అందరినీ ఆలోచింపజేసిందని చెప్పారు. పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనూరాధ, సునీత, అమ్మాజీ పాల్గొన్నారు.

23న కేఎల్‌యూ సిల్వర్ జూబ్లీ వేడుకలు



పోస్టర్‌ను విడుదల చేస్తున్న రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, డైరెక్టర్ కావ్య, సోని తదితరులు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయం సిల్వర్‌జూబ్లీ వేడుకలను ఈనెల 23వ తేదీ నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు తెలిపారు. విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వేడుకల వాల్‌పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 1994–98 విద్యా సంవత్సరంలో ఇంజినీరింగ్ కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులందరికీ 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహిండానికి అన్ని ఏర్పాటు పూర్తి చేశామన్నారు. వేడుకలను విజయవంతం చేయాలని పూర్వ విద్యార్థుల విభాగం డైరెక్టర్ డాక్టర్ కేసీహెచ్ కావ్య కోరారు. కార్యక్రమంలో ప్రొ వైస్‌చాన్సలర్ డాక్టర్ ఎన్.వెంకటరామ్, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఎం. సుమన్, వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, పూర్వ విద్యార్థుల విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ కె.సోని పాల్గొన్నారు.

కొండ ప్రాంతంలో ఆక్రమ నిర్మాణాలపై సర్వే



కొండ వెనుక నిర్మించిన నిర్మాణం వద్ద కొలతలు వేస్తున్న జిల్లా సర్వేయర్ మల్లికార్జునరావు

తాడికొండ: తాడికొండ కొండ వెనుక చేపట్టిన నిర్మాణాలను జిల్లా సర్వేయర్ మల్లికార్జునరావు పరిశీలించారు. గ్రామంలోని కొండ వెనుక సర్వే నంబర్ 361/1లో కొండ పోరంబోకును ఆక్రమించి అక్రమ నిర్మాణం జరిగిందంటూ జిల్లా అధికారులకు గ్రీవెన్స్‌లో తాడికొండకు చెందిన షేక్ జానీ, ఖలీల్ ఫిర్యాదు చేశారు. అయితే దీనికి రిజిస్ట్రేషన్ హక్కులు ఉన్నాయని, సదరు యజమాని కోర్టుకు వెళ్లడంతో తొలగించడం కుదరదని స్థానిక అధికారులు తెలపడంతో ఫిర్యాదు దారులు జేసీని ఆశ్రయించి జిల్లా సర్వేయర్‌తో సర్వే చేయించాలని కోరారు. జేసీ ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా సర్వేయర్ వచ్చి తాడికొండ కొండ వెనుక నిర్మాణం ఉన్న ప్రాంతాన్ని కొలతలు వేసి ఈ ప్రాంతం కొండ పోరంబోకుగా నిర్ధారించారు. కాగా మరో సర్వే నంబర్‌తో రిజిస్ట్రేషన్ చేసి కొండను ఆక్రమణ చేశారని ఫిర్యాదు దారులు ఆరోపించారు. అధికారులు దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఓటర్ల జాబితాపై అభ్యంతరాలకు అవకాశం



మాట్లాడుతున్న ఈఆర్‌ఓ లక్ష్మీకుమారి, తహసీల్దార్ రామ్‌ప్రసాద్

మంగళగిరి: ఓటర్ల సవరించిన జాబితాలపై సందేహాలుంటే అధికారుల దృష్టికి తీసుకువచ్చి నివృత్తి చేసుకోవాలని డెప్యూటీ కలెక్టర్, ఈఆర్‌ఓ లక్ష్మీకుమారి తెలిపారు. నగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఓటర్ల జాబితాపై అభ్యంతరాలుంటే కచ్చితంగా తెలియజేయాలని సూచించారు. పోలింగ్ స్టేషన్ మార్పు అనేది ఆస్టేషన్ శిథిలావస్థకు చేరుకుంటే మార్చడం జరుగుతుందన్నారు. ఒక ప్రాంతంలో ఎవరు లేరని తెలిస్తేనే పరిశీలన అనంతరం ఓట్ల తొలగింపు వుంటుందన్నారు. రేషనలైజేషన్ ప్రక్రియలో ఒక కుటుంబంలో సభ్యులని కాని ఓటర్లను కాని వేర్వేరు పోలింగ్ స్టేషన్‌లలోకి మార్చేందుకు వీలులేదన్నారు. రాజకీయపార్టీల ప్రతినిధులు అనుమానాలకు తావు లేని విధంగా సహకరించాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్ జీవీ రామ్‌ప్రసాద్, ఏఈఆర్‌ఓ, కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ హేమమాలిని, డెప్యూటీ కమిషనర్ శివారెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికలలో ఎస్సీలకు ప్రాధాన్యం ఇవ్వాలి

మంగళగిరి: రానున్న ఎన్నికలలో ఎస్సీలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని లేకుంటే ఎస్సీ సామాజిక వర్గం నుంచి అభ్యర్థులను నిలబెట్టి తేల్చుకుంటామని మాదిగ ఆర్థికాభివృద్ధి చైతన్య సమితి(ఎంఎస్ఎస్) అధ్యక్షుడు బేతపూడి సాంబయ్య డిమాండ్ చేశారు. నగరంలోని ఐబీఎన్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్సీలకు రాజకీయంగా తీరని అన్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కురగంటి ఆదామ్, వడ్డే రామారావు, నల్లూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పంట నష్ట అంచనాలకు బృందాలు

తాడేపల్లిరూరల్: మిచాంగ్ తుఫాన్ కారణంగా పంట నష్టం అంచనాలు తయారు చేస్తున్నట్లు దుగ్గిరాల తహసీల్దార్ మల్లేశ్వరి మంగళవారం తెలిపారు. వరి, అరటి, మినుము పంటలు నష్టపోయినట్లు ప్రాథమికంగా గుర్తించామని, గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు మండల స్థాయి, గ్రామ స్థాయిలో టీమ్‌లుగా ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. ఈనెల 18వ తేదీ లోపు పంట నష్ట అంచనాలను తయారు చేసి స్థానిక రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేస్తామని, కావున పంట నష్టం వాటిల్లిన ప్రతి రైతు వారి పొలం పాస్‌బుక్, ఆధార్‌కార్డ్, బ్యాంక్ ఖాతా పుస్తకం జిరాక్స్ కాపీలను తీసుకుని తమ పొలాన్ని వీఆర్‌ఓ, వి.ఎ.ఎ.లకు చూపించి నమోదు చేసుకోవాలని అన్నారు.